

పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని శివగల బసవన్నకు, శ్రీశైల క్షేత్రపాలకుడు బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు.



ఓటరూ.. స్మార్ట్‌గా తెలుసుకో..

ఎన్నికల కమిషన్ 2024 సంవత్సరానికి సంబంధించి ఓటరు ముసాయిదా జాబితా విడుదల చేసింది. జాబితాలో మీ ఓటు ఉందో.. లేదో అనే విషయాన్ని స్మార్ట్‌గా తెలుసుకోవచ్చు. 8లో..



శాస్త్రవేత్తలుగా ఎదగాలి

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నంద్యాలలో బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు ప్రారంభమయ్యాయి. 8లో..

న్యూస్‌రీల్

నేటి నుంచి పింఛన్ కానుక పంపిణీ

- ఉమ్మడి జిల్లాలో 4,68,368 పింఛన్ల కు రూ.129.84 కోట్లు విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద నవంబర్ నెల పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధమైంది. బుధవారం నుంచి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పింఛన్ల పంపిణీకి అవసరమైన నగదును బ్యాంకుల నుంచి వార్డు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు డ్రా చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4,68,368 పింఛన్లు ఉండగా రూ.129,84,45,500 విడుదలైంది. కర్నూలు జిల్లాలో 2,46,112 పింఛన్లకు రూ.68.46 కోట్లు, నంద్యాల జిల్లాలో 2,22,274 పింఛన్లకు రూ.61.38 కోట్లు కేటాయించారు. నవంబర్ నెల పింఛన్లను బుధవారం ఉదయం నుంచే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గ్రామ, వార్డు వలంటీర్లు పంపిణీ చేయనున్నారు. ఈనెల 5వ తేదీ వరకు పంపిణీ కొనసాగనుంది.

క్వింటా ఉల్లి రూ.5,200

- రికార్డు స్థాయిలో మార్కెట్‌కు 8,380 క్వింటాళ్లు రాక

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉల్లి దిగుబడులు వెల్లువెత్తుతున్నాయి. ఎప్పుడు ధరలు తగ్గుతాయోనన్న ఆందోళనతో కాస్త ముందుగానే కోసి మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. ఈ ఏడాదిలోనే రికార్డు స్థాయిలో మార్కెట్‌కు ఉల్లి వచ్చింది. మంగళవారం 338 మంది రైతులు 8,380 క్వింటాళ్ల ఉల్లిని మార్కెట్‌కు తెచ్చారు. ఈ–నామ్‌లో అయినందున మధ్యాహ్నం 2.30 గంటల టెండర్ ప్రక్రియ ముగిసింది. ఈ నెల 30న గరిష్ట ధర రూ.4,885 పలుకగా.. తాజాగా క్వింటా ధర గరిష్ట ధర రూ.5,200 పలికింది. కనిష్ట ధర రూ.809, మోడల్ ధర రూ.3,600 నమోదైంది. ఈ సారి ఖరీఫ్‌లో 25,461 మంది రైతులు 41,696 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. మూడేళ్లుగా ఉల్లికి ధరలు లేవు. ప్రతి ఏటా నష్టాలు మూటకట్టుకున్నారు. ఈ ఏడాది కూడా వర్షాభావం వల్ల ఉల్లి సాగు మెరుగ్గానే ఉన్నా దిగుబడులు తగ్గినట్లు స్పష్టమవుతోంది. అయితే ధరలు పెరుగుతుండటం రైతులకు ఊరటనిస్తోంది. ఇదిలా ఉంటే కర్నూలు మార్కెట్‌లో ఎండుమిర్చి ధర కూడా ఆశాజనకంగానే ఉంది. కనిష్ట ధర రూ.9,801, గరిష్ట ధర రూ.19,999.. మోడల్ ధర రూ.14,601 నమోదైంది.

ఓటింగ్ యంత్రాల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ భేష్

- ఈవీఎంల నోడల్ అధికారి లలిత్ మిట్టల్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాలో ఓటింగ్ యంత్రాల పనితీరుపై ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ భేష్‌గా సాగుతోందని కేంద్ర ఎన్నికల ఎఫ్ఎల్‌సీ పరిశీలకుడు, ఈవీఎంల నోడల్ అధికారి లలిత్ మిట్టల్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆకస్మికంగా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో జరుగుతున్న ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను పరిశీలించారు. ముందుగా సిబ్బంది హాజరు, లాగ్, పొలిటికల్ పార్టీల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం లోపలికి వెళ్లి కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లతోపాటు వీవీప్యాట్ల పనితీరును పరిశీలిస్తున్న బెల్ ఇంజినీర్ల పనితీరుపై ఆరా తీశారు. గోదాము భద్రత, సెక్యూరిటీ సిబ్బంది షిఫ్టుల వారిగా పనిచేసే అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వెబ్ కాస్టింగ్ పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ హరిప్రసాదు, ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ నోడల్ అధికారి నాగరాజునాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

భరోసానిచ్చి.. కష్టాలు తీర్చి

సబ్సిడీ విత్తనాలు.. రసాయన ఎరువులు.. రాయితీ పరికరాలు, పంట నష్టపరిహారం మంజూరు కోసం గతంలో మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. వ్యయప్రయాసలు తప్ప ఆశించిన ప్రయోజనం లభించేది కాదు. రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగలేక రైతులు ఈ అవస్థలు ఇంకెన్నాళ్లు అంటూ పెదవి విరిచేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారి కష్టాలన్నీ తీరాయి. గ్రామస్థాయిలోనే వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన సేవలన్నీ అందుతున్నాయి. అన్నదాతలకు అన్ని రకాలుగా అండగా నిలుస్తూ రైతు భరోసా కేంద్రాలు సేవాలయాలుగా నిలిచాయి.



హుసేనాపురం ఆర్బీకేలో రైతుకు విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

- ఆర్బీకేలతో గ్రామస్థాయిలోనే రైతులకు అన్ని రకాల సేవలు
- విత్తు నుంచి విక్రయం వరకూ ఆర్‌బీకేల ద్వారానే
- వ్యవసాయ సలహా మండళ్ల ఏర్పాటు
- మూడేళ్లలోనే అద్భుత ఫలితాలు

కర్నూలు(అగ్రికల్చర్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దూరదృష్టితో నెలకొల్పిన రైతుభరోసా కేంద్రాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇవి 2020 మే నెల 30వ తేదీన ప్రారంభమయ్యాయి. వ్యవసాయ శాఖకు సంబంధించిన సేవలే కాకుండా ఉద్యాన శాఖ, ఏపీఎంఐపీ, పశుసంవర్ధక, మత్స్య, పట్టుపరిశ్రమ, మార్కెటింగ్ శాఖల సేవలన్నీ గ్రామస్థాయిలోనే అందిస్తున్నాయి. దీంతో అన్నదాతలకు సమయం, డబ్బులు ఆదా కావడంతో పాటు మండల కేంద్రాలకు వెళ్లే శ్రమ తప్పింది. ఉమ్మడి జిల్లాలో 877 ఆర్‌బీకేలు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 849, అర్బన్‌లో 28 ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 466, నంద్యాల జిల్లాలో 411 ఆర్‌బీకేలు రైతులకు సేవలు అందిస్తున్నాయి.

అందుబాటులో అన్ని సేవలు

వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి ఉత్పాదకతను పెంచడం, ఇందుకు అవసరమైన అన్ని రకాల ఇన్‌పుట్స్.. అంటే విత్తనం మొదలు పండించిన పంటను మద్దతు ధరతో అమ్ముకునే వరకు ఆర్‌బీకేలు


రైతులకు సేవలందిస్తున్న ఆర్బీకే సిబ్బంది

రైతులకు అండగా నిలుస్తున్నాయి. ఆర్‌బీకేల్లో వ్యవసాయ విజ్ఞానానికి సంబంధించిన దాదాపు 50 పుస్తకాలతో మినీ లైబ్రరీలు ఏర్పాటయ్యాయి. ఆర్‌బీకేల్లోనే రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తారు. ఘన, ద్రవ జీవామృతం, కషాయాల తయారీ తదితర వాటిపై రైతులకు శిక్షణ ఇస్తారు. ఆడియో, వీడియోల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. డిజిటల్ కియోస్కుల ద్వారా అవసరమైన వాటిని ఆర్డర్ పెడితే చాలు.. ఇంటి ముంగిటకు వచ్చినట్లే. అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా డోన్ మండలం కొత్తపల్లి ఆర్‌బీకేకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ గుర్తింపు కూడా లభించడం విశేషం.

గతంలో ఇలా..

టీడీపీ హయాంలో సబ్సిడీపై పంపిణీ చేసే అరకొర విత్తనాల కోసం మండల, నియోజకవర్గాల కేంద్రాల్లో రైతులు పడిగాపులు కాసే వాళ్లు. బస్తా ఎరువు అవసరమొచ్చినా పరుగెత్తాల్సి వచ్చేది. ఇన్‌పుట్ సబ్సిడీ కోసం కార్యాలయాలు చుట్టూ కాళ్లరిగేలా తిరిగి నా కరుణ ఉండేది కాదు. పంటను మద్దతు ధరతో అమ్ముకునేందుకు ఎన్నో ప్రయాసలు ఎదుర్కోవాల్సి వచ్చేది.

అక్రమాలకు చెక్

గతంలో ప్రయివేటు డీలర్లు రసాయన ఎరువులను అడ్డుగోలుగా అధిక ధరలకు విక్రయించే వారు. ఎంఆర్‌పీపై రూ.50 నుంచి రూ.100 వరకు ఎక్కువ వసూలు చేసేవారు. ఆర్‌బీకేలు ఏర్పాటు అయిన తర్వాత ప్రయివేటు డీలర్ల అక్రమాలకు చెక్ పడింది. 2022–23లో కర్నూలు జిల్లాలో దాదాపు 18వేల టన్నులు, 2023–24లో ఇప్పటి వరకు 12500 టన్నుల ఎరువులను రైతులకు నిర్దిష్టమైన ధరలకే అందజేశారు. నంద్యాల జిల్లాలో 2022–23లో 25,375 టన్నులు, 2023–24లో 20,203 టన్నుల ఎరువులు రైతులకు పంపిణీ చేసినట్లు స్పష్టమవుతోంది. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ, కంపోస్ట్ ఎరువులు తదితరవన్నీ రైతు భరోసా కేంద్రాల్లోని లభిస్తున్నాయి. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు తదితర వాటి కోసం ఆర్‌బీకేల్లోని డిజిటల్ కియోస్కుల ద్వారా బుక్ చేసుకుంటే చాలు.. సేవలు అందినట్లే. ఈ సారి ప్రభుత్వం నానో లిక్విడ్ (ద్రవ రూప) యూరియా, నానో డీఏపీలను అందుబాటులోకి తెచ్చింది. ఆర్‌బీకేల ద్వారా అన్ని రకాల పురుగుమందులను కూడా కచ్చితమైన ధరలకే లభిస్తున్నాయి.

ఆర్‌బీకేలతో ఉపయోగాలు ఇవీ..

- సబ్సిడీపై పంపిణీ చేసే విత్తనాలతో పాటు నాన్ సబ్సిడీ విత్తనాలు కూడా ఆర్బీకేల ద్వారా రైతులకు అందుబాటులోకి వచ్చాయి.
- ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నాణ్యతా ప్రమాణాలను ముందుగా శాస్త్రీయంగా పరీక్షించిన తర్వాతనే పంపిణీ చేస్తున్నారు.
- ఈ–క్రాప్ నమోదుతో రూపాయి ఖర్చులేకుండా రైతులు బీమా సదుపాయం పొందుతున్నా రు.
- అధిక వర్షాలు పడి పంటలు దెబ్బతింటే ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఆర్‌బీకేల ద్వారానే ఎన్యూమరేషన్ చేస్తారు.
- సూక్ష్మ సేద్యం కోసం ఆర్‌బీకేల్లోనే పేర్లు నమోదు చేసుకోవచ్చు.
- మద్దతు ధర పొందేందుకు ఆర్‌బీకేలు ఆధారం.
- ప్రస్తుతం రబీ సీజన్‌కు సంబంధించి శనగ విత్తన పంపిణీ చురగ్గా జరుగుతోంది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 40 వేల క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేశారు.
- సమగ్ర యాజ మాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఆర్‌బీకేల వారీగా పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆర్‌బీకే స్థాయిలో వ్యవసాయ సలహా మండళ్లు ఏర్పాటు చేశారు. ప్రతి నెలా మొదటి శుక్రవారం ఆర్‌బీకే స్థాయి, రెండో శుక్రవారం మండల స్థాయి, మూడో శుక్రవారం జిల్లా స్థాయిలో వ్యవసాయ సలహా మండళ్ల సమావేశాలు నిర్వహిస్తారు.

సలహా మండళ్లు.. ఎన్నో మేళ్లు

రైతులు ఎదుర్కొనే సమస్యలపై చర్చించి వాటిని మండల స్థాయిలో జరిగే సమావేశానికి అజెండాగా పెడుతారు. మండల స్థాయిలో జరిగే సమావేశంలో వీటికి పరిష్కారాలను కనుగొంటారు. మండల స్థాయిలో పరిష్కారం కాని వాటిని జిల్లా స్థాయిలో జరిగే సమావేశంలో అజెండాగా పెడుతూ సమస్యలను పరిష్కరిస్తుండటం విశేషం.

“ సీఎంకు రుణపడి ఉంటాం



ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆర్‌బీకే ద్వారా 90 కిలోల వేరుశనగ విత్తనాలు పొందాం. ఆర్‌బీకేలు వచ్చిన తర్వాత మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. వ్యవసాయ సలహాలు, సూచనలు కూడా ఆర్‌బీకేల్లో ఇస్తున్నారు. ఆర్‌బీకే స్థాయిలో పంటల నమోదు చేసుకున్నాం. అన్ని రకాల సేవలు ఊర్లోనే అందుబాటులోకి తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–జి.ప్రహ్లాద, బురాన్‌దొడ్డి, సి.బెళగల్ మండలం

ఇబ్బందులు తొలగిపోయాయి



గతంలో సబ్సిడీ విత్తనాలకు మండల కేంద్రానికి వెళ్లి వరసలో నిలబడాల్సి వచ్చేది. ఒకటి, రెండు రోజులు అన్ని పనులు వదులుకోవాల్సి ఉండేది. నేడు ఆ ఇబ్బందులు తొలగిపోయాయి. రైతుభరోసా కేంద్రం ద్వారానే విత్తనాలు పొందుతున్నాం. ఎరువులు కూడా ఆర్‌బీకేల్లోనే ఇస్తున్నారు. ఆర్‌బీకేలో 2 టన్నుల యూరియాతో పాటు డీఏపీ, 20–20–0–13 పొందాం.

– వై.రామకృష్ణారెడ్డి, పుసులూరు, కల్లూరు మండలం

అన్ని రకాల సేవలు అందిస్తున్నాం



రైతుభరోసా కేంద్రాల ద్వారా అన్ని రకాల సేవలు అందాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకు అనుగుణంగా వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించిన సేవలు ఆర్‌బీకేల ద్వారా రైతు ముంగిట్లోనే అందించే ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు సేవలను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. సబ్సిడీతోపాటు నాన్ సబ్సిడీ విత్తనాలను కూడా అందిస్తున్నాం. కస్టమ్ హయ్యరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఆధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చాం. పంటల నమోదు పకడ్బందీగా జ రిగే ఏర్పాటు చేశాం. ఉపాధి హామీ పథకం నిధు లతో ఆర్‌బీకేలకు సొంత భవనాలు నిర్మిస్తున్నాం. – పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి, కర్నూలు

అనారోగ్యమని బయటకు వస్తే న్యాయం జరిగినట్లేనా?

- బాబు బెయిల్‌పై టీడీపీ నేతలకు మేయర్ బీవై రామయ్య ప్రశ్న


మేయర్ బీవై రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): స్కిల్ డెవలప్‌మెంట్ స్కాములో నిందితుడిగా ఉన్న చంద్రబాబు అనారోగ్య సమస్యలతో జైలు నుంచి మధ్యంతర బెయిల్‌పై బయటకు రావడంతోనే న్యాయం జరిగిందని టీడీపీ నేతలు చెప్పడం హాస్యాస్పందంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య విమర్శించారు. బాబు బెయిల్‌పై టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం పట్ల పలు ప్రశ్నలు వేశారు. చంద్రబాబు హయాంలో అవినీతి, అక్రమాలు జరగలేదా అని ప్రశ్నించారు. సానుభూతి కోసమే ఇలాంటి డ్రామాలు ఆడటం మానుకోవాలని తెలిపారు. టీడీపీ నేతలు మాయలో బతుకుతున్నారని, వారిలో తప్ప ప్రజల్లో స్పందన లేదని పేర్కొన్నారు. స్వాతంత్ర పోరాటం చేసి బాబు జైలుకు వెళ్లలేదనే విషయాన్ని ఆ పార్టీ తమ్ముళ్లు గుర్తుంచుకోవాలని సూచించారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చే రోజులకు కాలం చెల్లిందని, నిజానిజాలు రాబోవు రోజుల్లో తేలుతాయని స్పష్టం చేశారు. జబ్బు పేరు చెప్పి బయటకు వచ్చిన ఆయన ధర్మం గెలిచిందని అనుకోవడం భ్రమ అన్నారు. ఇప్పటికైనా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వాస్తవం తెలుసుకోవాలన్నారు.

నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయిన తరువాత ఐదేళ్లపాటు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించ లేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఏటా నిర్వహిస్తోంది. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు వివిధ శాఖలు పని విభజన చేసుకున్నాయి. ముందుగా బుధవారం ఉదయం 9.30 గంటలకు చిల్డ్రన్స్ పార్కులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారు. అనంతరం కొండారెడ్డి బురుజు సమీపంలోని తెలుగుతల్లీ విగ్రహానికి పూజలు నిర్వహిస్తారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో కలెక్టర్, ఎస్పీలు కలసి జాతీయ జెండావిష్కరణ చేసి పోలీసు దళాల గౌరవ వందనం స్వీకరిస్తారు. ఆతర్వాత కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ప్రాన్స్, ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ విజయవంతానికి కృషి

- జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్యామల



కర్నూలు(అగ్రికల్చర్): రాయలసీమ స్థాయిలో కర్నూలులో నిర్వహించే ప్రాన్స్, ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ విజయవంతానికి చర్యలు తీసుకుంటున్నట్లుగా జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్యామల తెలిపారు. చేపలు, రొయ్యల్లో ఉన్న పోషక విలువలపై అవగాహన పెంచి వినియోగాన్ని గణనీయంగా పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం కర్నూలు బంగారుపేటలోని కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఫిష్ ఆంధ్ర ప్రాజెక్టును ప్రజలకు మరింత చేరువ చేస్తున్నట్లు తెలిపారు. నవంబరు 3, 4, 5 తేదీల్లో కర్నూలులోని రావూస్ గార్డెన్‌లో రాయలసీమ స్థాయి ప్రాన్స్, ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బఫె పద్ధతిలో రూ.399పై చేపలు, రొయ్యల వంటకాలను అన్‌లిమిటెడ్‌గా ఆరగించవచ్చని తెలిపారు. మత్స్యరంగంలో ఉండే ఉపాధి అవకాశాలపై విద్యా సంస్థల్లో కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కర్నూలులోని ప్రధాన విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం బిర్లా గేట్ సమీపంలోని ఖానా ఖజానాలో స్కైలాన్సర్స్‌ను ఎగురవేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో భూమి ఆర్గానిక్ మేనేజింగ్ డైరెక్టర్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం


బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- కానుగల వాగుపై రూ. 30 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం
- బలపనూరు – వడ్డుగండ్ల గ్రామాల మధ్య రహదారి అభివృద్ధి
- భూమి పూజతో పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


కానుగల వాగుపై బ్రిడ్జి నిర్మించే ప్రదేశం

పాణ్యం: మూడు గ్రామాల పరిధిలో దాదాపు దశాబ్దాలుగా నెలకొన్న సమస్య శాశ్వత పరిష్కారం కాబోతుంది. నిత్యం రైతులు, ప్రజల ఎదుర్కొంటున్న కష్టాలు త్వరలో తీరనున్నాయి. బలపనూరు, వడ్డుగండ్ల, రసూల్లాపేట గ్రామాల ప్రజల కల నెరవేరబోతుంది. బలపనూరు – వడ్డుగండ్ల గ్రామాల మధ్య రహదారి అభివృద్ధిలో భాగంగా కానుగల వాగుపై రూ. 30 లక్షలతో బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బ్రిడ్జి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.30 లక్షల వ్యయంతో ఎస్ఆర్ఈజీఎస్ పథకంతో క్రాసింగ్ బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. బలపనూరు పంచాయతీకి మజరా గ్రామాలైన వడ్డుగండ్ల, రసూల్లాపేట ప్రజలు ప్రతి చిన్న పనికి పంచాయతీకి రావాలంటే చుట్టూ ఆరు కిలోమీటర్లు దూరం ప్రయాణించి రావాల్సి ఉందన్నారు. ఈ బ్రిడ్జి నిర్మిస్తే రెండున్నర కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుందన్నారు. బలపనూరు గ్రామానికి సంబంధించి వ్యవసాయభూమి కూడా వాగు అవతలనే ఉండటంతో రెండు గ్రామాల ప్రజల సౌకర్యార్థమై ఈ క్రాసింగ్ బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. మరో నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాని అధికారులను ఆదేశించారు. అవసరమైతే అదనపు నిధులు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో జెట్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సర్పంచ్ సొడం మాధవి, ఎంపీటీసీ సభ్యులు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కరుణాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామిరెడ్డి, రామచంద్రుడు, సుమంత్‌రెడ్డి, బాబు, ఎంపీడీఓ దస్తగిరి, మండల ఇంజనీరు మహబూబ్‌బాషా, తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలపై మరింత నమ్మకం కల్పించాలి

- ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండాలి
- టెస్ట్‌లు, మందులకు బయటకు పంపొద్దు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందే వైద్య సేవలపై ప్రజల్లో మరింత నమ్మకం కల్పించేలా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ధన్వంతరి హాలులో వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, వైద్యసిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ఆసుపత్రుల్లో వైద్యసేవలు, ఆరోగ్యశ్రీ అమలు, వైద్యపరికరాలు, సిబ్బంది అవసరత అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా విభాగాధిపతులు వారి వారి విభాగాల్లో పీజీలు, హౌస్‌సర్జన్లు, ఇతర వైద్య సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా, ప్రజలకు సరైన వైద్యసేవలు అందిస్తున్నారా.. అన్న విషయాలపై పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సోమవారం ఓపీ కౌంటర్‌కు కొంత మంది వ్యక్తులను పంపించి ర్యాండమ్‌గా చెక్ చేయించాని, అయితే అక్కడ పీజీలు, హౌస్‌సర్జన్లు, వైద్యులు అందుబాటులో లేరని, స్టాఫ్‌నర్సు ఓపీ రాసి ఇచ్చారని, స్టాఫ్‌నర్సుకు మందులు రాసే అధికారం ఎవరిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ప్రిస్కిప్షన్‌లో రాసిన మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నప్పటికీ బయట మెడికల్‌షాపులో తీసుకురావలని పంపించారన్నారు. టెస్ట్‌లకు, మందులకు బయటకు పంపించవద్దని గతంలోనూ చెప్పామన్నారు. న్యూరాలజీ విభాగంలో బేసిక్ స్ట్రోక్ యూనిట్, క్వాలిఫైడ్ న్యూరాలజిస్ట్, న్యూరోసర్జన్, ఫిజియోథెరపిస్ట్, ఎలక్ట్రో ఫిజియాలజిస్ట్ అవసరం ఉందని న్యూరాలజి హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గత హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో నిర్ణయించిన విధంగా చేపట్టాల్సిన మెయింటెనెన్స్ పనులు ఎంత వరకు వచ్చాయని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్‌ను ఆరా తీశారు. రూ.3కోట్లు మెడికల్ కాలేజికి, రూ.3కోట్లు ఆసుపత్రికి నిధులు మంజూరయ్యాయని, వీటికి టెండర్లు పిలిచామని ఈఈ వివరించారు. నవంబర్ ఆఖరులోపు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ పనులు పూర్తవుతాయని, కేథల్యాబ్ ఇన్‌స్టాలేషన్ మూడు రోజుల్లో పూర్తవుతుందని, డయాగ్నోస్టిక్ ల్యాబ్‌ను సోమవారంలోపు స్వాధీనం చేస్తామని అధికారులు వివరించారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రామగిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

మాతృమరణాలు సంభవిస్తే చర్యలు

జిల్లాలో మాతృమరణాలు సంభవించకూడదని, మాతృమరణాలు జరిగితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన హెచ్చరించారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ధన్వంతరి హాలులో ఈ ఏడాది సంభవించిన మాతృమరణాలపై వైద్యాధికారులు, ఆశాలు, ఏఎన్ఎంలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృమరణాలు సంభవించకుండా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది గట్టి చర్యలు చేపట్టాలన్నారు. ఆశ, ఏఎన్ఎంల ద్వారా ప్రసవానికి, ప్రసవానికి మధ్య సరైన సమయం ఉండే విధంగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్యను ఆదేశించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ మాధవి, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, డీఐవో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పీహెచ్‌సీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్యులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


హెచ్‌ఆర్‌సీ చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలసిన కలెక్టర్



కర్నూలు(సెంట్రల్): హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ మాంధాత సీతారామమూర్తిని కలెక్టర్ డాక్టర్ జి.సృజన మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం సాయంత్రం ఆమె రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో ఉన్న హెచ్‌ఆర్‌సీ కార్యాలయంలో ఆయనను కలసి జిల్లాలోని తాజా పరిస్థితులను వివరించారు.

పత్తి మద్దతు ధరకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పండించిన పత్తిని రైతులు మద్దతు ధరతో అమ్ముకునేందుకు రైతుభరోసా కేంద్రాలను సంప్రదించి సీఎం యాప్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణ మూర్తి తెలిపారు. మద్దతు ధరతో అమ్ముకునేందుకు ఇప్పటికే ఏడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రైతులు పత్తిని మద్దతు ధరతో అమ్ముకునేందుకు ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని రంగంలోకి దించిందన్నారు. పొడువు పింజ పత్తికి మద్దతు ధర రూ.7,020, పొట్టి పింజ పత్తికి మద్దతు ధర రూ.6,620 ఉందన్నారు. ప్రస్తుతానికి పత్తి ధరలు ఆశాజనకంగానే ఉన్నప్పటికీ.. రానున్న రోజుల్లో ధరలు తగ్గితే రైతులు నష్టపోకుండా మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మండలం పెంచికలపాడుల్లో కొనుగోలు కేంద్రాలను పత్తి జిన్నింగ్ మిల్లుల్లోనే ఏర్పాటు చేశామన్నారు.



క్లుప్తంగా

జిల్లా పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షునిగా డాక్టర్ మల్లన్న



పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్యను కలసిన డాక్టర్ మల్లన్న తదితరులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పశువైద్యాధికారుల సంఘం నూతన అధ్యక్షునిగా డాక్టర్ మల్లన్న నియమితులయ్యారు. ఈయన ఆదోని ఏరియా పశువైద్యశాల ఏడీగా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై నగరపాలక సంస్థలో వీధి కుక్కల కుటుంబ నియంత్రణా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. జిల్లా పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏడాది క్రితం జిల్లా పశువైద్యాధికారుల సంఘం ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష పదవికి ఏడీలు డాక్టర్ పార్థసారథి, డాక్టర్ మల్లన్న పోటీపడగా ఇద్దరికీ సమానంగా ఓట్లు వచ్చాయి. దీంతో సగం పదవీ కాలం ఒకరు, మరో సగం పదవీ కాలంలో మరొకరు నిర్వహించేలా తీర్మానించారు. మొదటి ఏడాది అధ్యక్షునిగా పార్థసారథి వ్యవహరించారు. ఏడాది పూర్తి కావడంతో డాక్టర్ మల్లన్నకు బాధ్యతలు అప్పగించారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సేవా భక్తులు

మంత్రాలయం: ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం హుండీ కానుకల ఆదాయం రూ. 3,73,10,010 సమకూరినట్లు మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక రాజాంగణ భవనంలో అక్టోబర్ నెలకు సంబంధించిన హుండీ కానుకలను లెక్కించారు. 35 రోజులకు ప్రధాన హుండీల నుంచి నగదు రూపంలో రూ.3,62,27,720 వచ్చిందన్నారు. నాణేలా రూపేణా రూ.10,82,290 రాగా, బంగారు 60 గ్రాములు, వెండి 1396 గ్రాములు సమకూరిందన్నారు. ఈ లెక్కింపు మఠం మేనేజర్-ఏ శ్రీనివాసరావు, మేనేజర్-బి వెంకటేష్ జోషి నేతృత్వంలో నిర్వహించారు.

ఓటరూ..‘స్మార్ట్’గా తెలుసుకో!

- చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు
- జాబితాలో ఓటు ఉందో లేదో క్షణాల్లో తెలుసుకోవచ్చు
- ఇంటి గడప దాటకుండా మొబైల్ నుంచే ఓటు హక్కుకు దరఖాస్తు
- సందేహాలుంటే 1,950 నంబర్‌కు కాల్ చేయొచ్చు
- నంద్యాల జిల్లాలో 13,57,998 మంది ఓటర్లు, 1621 పోలింగ్ కేంద్రాలు



సాక్షి, నంద్యాల: ఓటు ప్రజాస్వామ్యానికి ఆయువు. అలాంటి ఓటు హక్కును 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలి. ఎవరికైనా లేకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు గతంలో మాదిరిగా ప్రభుత్వ కార్యాలయాలు, బీఎల్ఓల చుట్టూ తిరగాల్సిన పని లేదు. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు ఇంటి నుంచే కొత్త ఓటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అంతేకాదు ఇది వరకే ఓటు హక్కు కలిగి ఉంటే వివరాలు చెక్‌చేసుకోవచ్చు. తప్పులుంటే సరిచేసుకోవచ్చు.

ఇంకో ఆరు నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల కమిషన్ 2024 సంవత్సరానికి సంబంధించి ఓటరు ముసాయిదా జాబితా విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం నంద్యాల జిల్లాలో 1,621 పోలింగ్ కేంద్రాలున్నాయి. 13,57,998 మంది ఓటర్లున్నారు. ఇప్పటికీ కొన్ని అనివార్య కారణాలతో ఓటు నమోదు చేసుకోని వారు ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు నూతన ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు తాజాగా విడుదల చేసిన ముసాయిదాలో మీ ఓటు ఉందో లేదో కూడా చెక్ చేసుకోవచ్చు.

ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా...

గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. అక్కడ తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ఒకదాన్ని సెలెక్ట్ చేసుకుని రిజిస్టర్ చేసుకోండి. తరువాత మీ ఓటు ఉందో లేదో నాలుగు మార్గాల ద్వారా చెక్ చేసుకోవచ్చు.

బార్ కోడ్ స్కానింగ్

పాత ఓటరు కార్డు ముందు భాగంలో బార్ కోడ్ ఉంటుంది. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లోని బార్ కోడ్ ఆప్షన్ ఎంపిక చేసుకుని క్లిక్ చేయండి. కెమెరా ఓపెన్ కాగానే ఓటరు కార్డుపై ఉన్న బార్ కోడ్ స్కాన్ చేస్తే మీ ఓటు వివరాలు వస్తాయి.

క్యూఆర్ కోడ్ స్కానింగ్

కొత్త ఓటరు కార్డులు క్యూఆర్ కోడ్‌తో వస్తున్నాయి. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లోని క్యూఆర్ కోడ్ ఆప్షన్ ఎంపిక చేసుకుని స్కాన్ చేస్తే మీ ఓటు వివరాలు తెలుస్తాయి.

వివరాలు అన్ని నమోదు చేసి..!

ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ఓపెన్ చేసి అక్కడ ఓటరు కార్డులో ఉన్న వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. తండ్రి పేరు, వయస్సు, లింగం, రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం వివరాలు నమోదు చేస్తే మీ ఓటు గురించి తెలుసుకోవచ్చు.

ఓటరు కార్డు నెంబరుతో...

ప్రతి ఓటు కార్డుకు నెంబరు ఉంటుంది. నెంబర్ ఆప్షన్ ఎంచుకుని మీ కార్డు నంబర్ నమోదు చేయాలి. అప్పుడు ఓటరు వివరాలు అన్నీ తెలుస్తాయి. మీ దగ్గర కార్డు లేకపోయిన ఓటరు కార్డు నంబర్ ఉంటే చాలు మీ ఓటు వివరాలను తెలుసుకోవచ్చు.

వెబ్‌సైట్ ద్వారా ఇలా...

ఓటర్స్ సర్వీస్ పోర్టల్ వైబ్‌సైట్ ద్వారా కూడా ఓటుకు సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చు. బీఎల్ఓలను ఆశ్రయించాల్సిన అవసరం లేదు. నేరుగా రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఈఓ ఆంధ్రా.ఎన్ఐసీ.ఇన్, కేంద్ర ఎన్నికల సంఘం వెవెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్, ఓటర్స్.ఈసీఐ.జీఓవీ.ఇన్ లలో చెక్ చేసుకోవచ్చు. మీకు ఏమైనా సందేహాలుంటే 1950 నంబర్‌కు ఫోన్ చేసి సూచనలు తీసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తుఫారం

ప్రస్తుత డిజిటల్ యుగంలోనూ చాలామంది యువత ఓటు కోసం దరఖాస్తు చేసుకునేందుకు రెవెన్యూ కార్యాలయాలు, బీఎల్ఓలు, నెట్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. చేతిలో స్మార్ట్‌ఫోన్ పెట్టుకుని కాళ్లరిగేలా తిరగాల్సిన అవసరం లేదు. కొత్త ఓటరుగా నమోదు కోసం ఫారం 6 దరఖాస్తును ఆన్‌లైన్‌లోనే చేసుకోవచ్చు. 2024 జనవరికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్లు, ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు సమర్పించొచ్చు.

తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశం

తాజాగా విడుదలైన ఓటరు ముసాయిదా జాబితాలో మీ పేరు, వివరాలు అన్నీ సక్రమంగా ఉన్నాయో లేదో ఆన్‌లైన్‌లోనే సరి చూసుకోవచ్చు. ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మీ వివరాలు నమోదు చేస్తే యాప్‌లో డిస్‌ప్లే అవుతుంది. ఏమైనా తప్పులుంటే మళ్లీ సరిదిద్దుకునేందుకు కూడా అవకాశం ఉంది. దీనిపై నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రత్యేక డ్రైవ్‌లు కూడా చేపడుతున్నాం.

– పుల్లయ్య, డీఆర్ఓ, నంద్యాల

ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య

కర్నూలు: నగర పరిధిలోని బుధవారపేటలో నివాసముంటున్న షణ్ముఖ్ (24) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మవరం మండలం నీలకుంట తండాకు చెందిన ఈయన కొన్నేళ్లుగా కర్నూలులో ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గుంతకల్లుకు చెందిన రమణమ్మతో సోషల్ మీడియాలో పరిచయం ఏర్పడి ఏడాదిన్నర క్రితం పెళ్లి చేసుకున్నాడు. ఆమె కర్నూలులో నర్సింగ్ విద్య అభ్యసిస్తోంది. మంగళవారం ఉదయం కాలేజీ నుంచి ఇంటికి వచ్చేలోగా తాడుకు వేలాడుతూ కనిపించడంతో ఆమె ఆందోళనకు లోనై ఇరుగుపొరుగు సాయంతో ఉరి నుంచి తప్పించింది. అప్పటికే మృతిచెందాడు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్ ఆత్మహత్య...

కల్లూరు మండలం శరీన్‌నగర్‌లో నివాసముంటున్న వలంటీర్ వినోద్ (34) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతని తల్లిదండ్రులు నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని కాలనీలో నివాసముంటుండగా వినోద్ మాత్రం అవ్వ దగ్గర ఉంటున్నాడు. వ్యక్తిగత కారణంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

నారాయణ కళాశాల ఏజీఎంపై చీటింగ్ కేసు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్‌లో గుంటూరు నారాయణ కళాశాల ఏజీఎంగా పని చేస్తున్న అల్లాడి శ్రీకాంత్‌పై చీటింగ్ కేసు నమోదైంది. ఎస్ఐ రామాంజనేయరెడ్డి మంగళవారం ఈ విషయం వెల్లడించారు. మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన మంగవరపు శంకర్‌రెడ్డి అనే వ్యక్తి తన కుమారుడు ఉపేంద్రనాథ్‌రెడ్డిని మేనేజ్‌మెంట్ కోటా కింద బీటెక్ సీటు కోసం అల్లాడి శ్రీకాంత్‌కు మొత్తం రూ.9,05,000ను ఫోన్ పే చేశాడు. అయితే, ఇంత వరకు కళాశాలలో సీటు ఇవ్వకపోగా బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడు శంకర్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో నారాయణ కళాశాల ఏజీఎంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరిలో సామూహిక ఎలుకల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న డీడీ రాజునాయక్

నంద్యాల(అర్బన్): జిల్లాలో 39,500 హెక్టార్ల వరి పొలాల్లో సామూహిక ఎలుకల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ బాలునాయక్ తెలిపారు. ఇందుకు గాను 395.26 కేజీల బ్రోమోడియాలోన్ 0.25 శాతం మందును 100శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తామన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నంద్యాల మండలం సుబ్బారెడ్డి పాలెం, పాండురంగాపురం గ్రామాల్లో నిర్వహించిన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో డీడీ మాట్లాడారు. వరి పంటను ఎలుకలు దాదాపు 8–10 శాతం నష్టం కలిగిస్తాయని చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు మాట్లాడుతూ ఎలుకల నివారణకు బొరియలలో బ్రోమోడియాలోన్ 0.25శాతం ఎరలను ఉంచాలన్నారు. ఎరను తయారు చేసుకోవడానికి ఒక కేజీ నూకలు, 10 ఎంఎల్ నూనె, 10 గ్రాములు బ్రోమోడియాలోన్ 0.25శాతం మందును కలుపుకుని 10గ్రాములు ఒక ప్యాకెట్‌గా చేసుకోవాలన్నారు. వాటిని తిన్న ఎలుకలు చనిపోతాయని చెప్పారు. రైతులందరూ తప్పకుండా ఈ రకమైన కార్యక్రమాలు సామూహికంగా నిర్వహించి ఎలుకల ఉద్ధృతిని తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రాజశేఖర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయాధికారి అయూబ్‌బాషా, ఎంఏఓ ప్రసాదరావు, పాండురంగాపురం మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరరెడ్డి, ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఫీడ్ బ్యాక్ లేక!

- పెద్దాసుపత్రిలో క్లెయిమ్ కాని ఆరోగ్యశ్రీ కేసులు
- డిశ్చార్జ్ తర్వాత రోగి ఆరోగ్యవివరాల సమాచారమివ్వని ఏఎన్ఎంలు
- పర్యవేక్షించని వైద్య ఆరోగ్యశాఖాధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కేసులకు క్లెయిమ్ మొత్తం రావడం లేదు. ఈ కారణంగా ఆసుపత్రిలో అభివృద్ధికి నిధుల లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు ఫీడ్ బ్యాక్ ఇవ్వకపోవడమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఆసుపత్రిలో ప్రతి నెలా 3వేల వరకు ఆరోగ్యశ్రీ కేసులను అప్‌లోడ్ చేస్తుంటారు. ఇందుకు గాను దాదాపు రూ.కోటి వరకు నిధులు క్లెయిమ్ కావాల్సి ఉంటుంది. ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ డాక్యుమెంటేషన్‌కు సంబంధించిన వివరాలు పూర్తి చేసి అప్‌లోడ్ చేసిన సమయంలో కొన్ని రకాల సమస్యలు ఉత్పన్నమవడం సహజం. అలాంటి సమయంలో ఆసుపత్రి అధికారులు, వైద్యులు సంబంధించిన ఎర్రర్స్ సరిచేసి తిరిగి అప్‌లోడ్ చేస్తూ ఉంటారు. అయితే, ప్రతి నెలా 5 నుంచి 7 శాతం ఎర్రర్స్ కనిపించడం సహజం. కానీ గత కొంత కాలంగా ఎర్రర్స్ శాతం 25 వరకు ఉంటోంది. ఆసుపత్రి నుంచి రోగి డిశ్చార్జ్ అయ్యాక విశ్రాంతి తీసుకునే సమయంలో వారి ఇంటికి ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు వెళ్లి వారి ఆరోగ్య వివరాలు కనుగొని ఫీడ్‌బ్యాక్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, గత కొంతకాలంగా సదరు ఫీడ్‌బ్యాక్ ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. ఇది ఆసుపత్రికి ఆరోగ్యశ్రీ మొత్తం క్లెయిమ్ కావడానికి అడ్డంకిగా మారుతోంది. ఇదే అంశాన్ని కోడ్ చేస్తూ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ వారు ఆసుపత్రికి సూచనలు పంపిస్తున్నారు. ఆరోగ్యశ్రీ కేసులకు క్లెయిమ్ పెయిడ్ రాకపోవడంతో ఆసుపత్రి నిధుల లేమి ఏర్పడుతోంది. దీంతో పాటు వైద్యులు, సిబ్బందికి పారితోషికం జారీలో జాప్యం జరుగుతోంది. తాము ఎంతో కష్టపడి కేసులు చేస్తున్నా క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు ఫీడ్‌బ్యాక్ ఇవ్వకపోతే ఎలా అని, దీనివల్ల తాము పడ్డ శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతోందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య వివరణ ఇస్తూ ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీల నుంచి పలుచోట్ల ఫీడ్‌బ్యాక్ ఇవ్వకపోవడం వాస్తవమన్నారు. ఈ విషయమై ఇటీవలే జూమ్ కాన్ఫరెన్స్‌లో చర్చించి వారికి సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. ఫీడ్‌బ్యాక్ తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించామన్నారు.

అంతర్జాతీయ ఈత పోటీల్లో జిల్లా స్విమ్మర్ల ప్రతిభ

- 17 గోల్డ్, 4 సిల్వర్, 2 బ్రాంజ్ మెడల్స్ కైవసం



మెడల్స్ సాధించిన మాస్టర్ స్విమ్మర్స్

కర్నూలు కల్చరల్: దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ ఈత పోటీల్లో జిల్లా వాసులు ప్రతిభ చాటారు. హేమర్ స్పోర్ట్స్ ఎగ్జిబిషన్ ఆర్గనైజేషన్ 27, 28 తేదీల్లో నిర్వహించిన మాస్టర్స్ ఈత పోటీల్లో పలు దేశాల స్విమ్మర్లు పాల్గొన్నారు. అందులో జిల్లా స్విమ్మర్లు ఐదుగురు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 17 గోల్డ్, 4 సిల్వర్, 2 బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. 70–74 సంవత్సరాల విభాగంలో జె.లక్ష్మీనారాయణరెడ్డి 50 మీటర్ల ఫ్రీ స్టైల్, బ్రెస్ట్ స్ట్రోక్, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్ ఈవెంట్‌లలో ప్రథమ స్థానంలో నిలిచి నాలుగు బంగారు పతకాలు సాధించారు. 60–64 సంవత్సరాల విభాగంలో జి.గఫూర్ మియ్యా 100, 200 మీటర్ల ఫ్రీ స్టైల్, 50, 100 మీటర్స్ బటర్ ఫ్లై ఈవెంట్లలో ప్రథమ స్థానంలో నిలిచి నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించారు. 60 -64 సంవత్సరాల విభాగంలో ఎంఎల్. శ్రీనివాసరెడ్డి 50 మీటర్ల ఫ్రీ స్టైల్, బ్యాక్, బ్రెస్ట్ స్ట్రోక్ ఈవెంట్లలో మొదటి స్థానంలో నిలిచి మూడు గోల్డ్ మెడల్స్, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ ఈవెంట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. 65–69 సంవత్సరాల విభాగంలో ఫయాజ్ అలిఖాన్ మూడు బంగారు, ఒక వెండి పతకం సాధించారు. 55–59 సంవత్సరాల విభాగంలో ఎంసీవీ రమణారెడ్డి రెండు బంగారు, ఒకటి సిల్వర్, ఒకటి బ్రాంజ్ మెడల్ సాధించారు. 70–74 సంవత్సరాల విభాగంలో కురువ లక్ష్మన్న ఒక గోల్డ్, ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్స్ సాధించి భారత జాతీయ పతకాన్ని రెపరెపలాడించారు. మెడల్స్ సాధించిన స్విమ్మర్లను మంగళవారం మాస్టర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్, స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ, స్విమ్మింగ్ పూల్ కోచ్ నటరాజ్ పలువురు స్విమ్మర్లు, అభినందనలు తెలిపారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి



ఉత్తమ ప్రాజెక్టుల విద్యార్థులతో ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు వినూత్న ఆలోచనలతో శాస్త్రవేత్తలుగా ఎదగాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని శాంతినికేతన్ సీబీఎస్ఈ పాఠశాలలో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలను జిల్లా కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. పలువురు విద్యార్థులు వివిధ అంశాలపై ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు శాస్త్రీయ అంశాలపై దృష్టి సారించాలన్నారు. శాస్త్రవేత్తలుగా రాణించేందుకు బాలల సైన్స్ కాంగ్రెస్ చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ వేదికలపై తమ సత్తా చాటుతున్నారన్నారు. అనంతరం డీఈఓ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయన మందుల వాడకాన్ని తగ్గించే మార్గాలను విద్యార్థులు అన్వేషించాలన్నారు. ప్రతి విద్యార్థి పచ్చదనం పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం తదితర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం ఏడు ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎంపిక చేసి విజేతలకు బహుమతులు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్, ఎన్‌సీఎస్‌సీ టీం కేవీ సుబ్బారెడ్డి, సుందర్‌రావు, కుమారబాబు, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, పినాకపాణి, మైఖేల్, విజయరాజు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు నగరపాలక సంస్థ

ఆర్.సి.నెం. A1/599110/2023 కర్నూలు, తేది: 31.10.2023

పూల మార్కెట్ బహిరంగ వేలము ప్రకటన

కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని పాత బస్టాండ్ ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ పెట్రోల్ రిటైల్ ఔట్లెట్ ప్రక్కన గల మున్సిపల్ కార్పోరేషన్‌కు చెందిన ఖాళీ స్థలము నందు పూల మార్కెట్ ఏర్పాటు చేయుటకు నిశ్చయించడమైనది. దాదాపు 7000 చ.అడుగుల స్థలముతో దాదాపు 5000 చ.అడుగుల స్థలముతో షెడ్లు నిర్మించి ఉంచడమైనది. క్రింద తెలిపిన విధముగా షాపులు ఏర్పాటు చేసుకొనవచ్చును.

I) 110 చదరపు అడుగులతో : 14 No's షాపులు ఏర్పాటు చేసుకొనవచ్చును.
II) 170 చదరపు అడుగులతో : 16 No's షాపులు ఏర్పాటు చేసుకొనవచ్చును.
III) 100 చదరపు అడుగులతో : 8 No's షాపులు ఏర్పాటు చేసుకొనవచ్చును.

కావున షెడ్ల నిర్మాణం గల మొత్తం ఖాళీ స్థలమును లీజుకు ఇచ్చుటకు గుడ్‌విల్ మొత్తంపై బహిరంగ వేలము వేయుటకు నిశ్చయించడమైనది. గుడ్‌విల్ మొత్తం ఎవరు ఎక్కువ చెల్లించెదరో వారికి ఆ యొక్క ఖాళీ స్థలము 1 సంవత్సరము కాలము అద్దె వసూలు చేయు హక్కును మంజూరు చేయబడును. పూల మార్కెట్ షెడ్ల నిర్మాణం గల ఖాళీ స్థలము బహిరంగ వేలము నందు పాల్గొనుటకు ముందుగా చెల్లించవలసిన మొత్తం **రూ. 2,00,000/- గుడ్‌విల్ మొత్తం** నగదు రూపములో గాని లేదా డి.డి. రూపములో గాని చెల్లించి బహిరంగ వేలము నందు పాల్గొనవచ్చును. చెక్కులు స్వీకరించబడవు. వేలములో పాల్గొనువారు ఆధారు కార్డు మరియు ఏదైనా గుర్తింపు కార్డు అనగా బ్యాంక్ పాస్‌బుక్ గాని లేదా ప్రాపర్టీ డాక్యుమెంట్ గాని, పాన్ కార్డు గాని, రేషన్ కార్డు గాని, డ్రైవింగ్ లైసెన్స్ గాని, దరఖాస్తుతో పాటు సమర్పించవలెను.

బహిరంగ వేలము నిర్వహించు తేది:
08.11.2023 సమయము ఉదయం. 11.00 గంటలకు
బహిరంగ వేలము నిర్వహించు స్థలము : కర్నూలు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్

ఎ) వేలములో హెచ్చుపాటదారుడు మొదట చెల్లించిన గుడ్‌విల్ పోను మిగిలిన మొత్తము వెంటనే చెల్లించవలెను.
బి) వేలములో పాడిన హెచ్చు గుడ్‌విల్‌తో పాటు 18% జి.యస్.టి. వెంటనే చెల్లించవలెను.
సి) వేలములో పాడిన హెచ్చు గుడ్‌విల్‌పై 1% స్టాంప్ డ్యూటీ చెల్లించి తగిన రశీదు పొందవలెయును.

ఇతర వివరముల కొరకు రెవిన్యూ అధికారిని గాని లేక సంబంధిత అధికారిని గాని సంప్రదించగలరు.

సం/- కమీషనరు, కర్నూలు నగరపాలక సంస్థ, కర్నూలు

ఆళ్లగడ్డలో 16 నాటు తుపాకులు స్వాధీనం

బొమ్మలసత్రం:ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో నిర్వహించిన కార్డెన్ సర్చ్‌లో అక్రమంగా దాచి ఉంచిన 16 నాటు తుపాకులను జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ ఆళ్లగడ్డ సబ్ డివిజన్ ప్రాంతంలోని ఆంజనేయులు, నరసింహ, శేఖర్, నారాయణ, శివ, పాములేటి, నాగరాజు, కాకిరామాంజనేయులు, హరి, రామాంజనేయులు, అంకన్న, పాములేటి, వరికుంట్ల నారాయణ, వీరయ్య, ప్రభాకర్, సారము, కొమ్ము, ప్రభాకర్, రామకృష్ణ, తిరుపతి ఇళ్లలో పోలీసులు దాడులు నిర్వహించారన్నారు. ఎటువంటి లైసెన్స్ లేకుండా వారు 16 నాటుతుపాకులు, 3 బారెళ్లు కలిగి ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో డీఎస్పీ వెంకటరామయ్య, సీఐలు రమేష్ బాబు, హనుమంత నాయక్ , ఎస్ఐలు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి దుర్మరణం



మృతి చెందిన వెంకటప్రసాద్ , గాయపడిన సుమంత్

ఓర్వకల్లు: గడివేముల క్రాస్ రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. హుసేనాపురం గ్రామానికి చెందిన వెంకట సుబ్బారెడ్డి కుమారుడు వెంకటప్రసాద్(20), అదే గ్రామానికి చెందిన మల్లికార్జున కుమారుడు సుమంత్ అనే ఇద్దరు యువకులు మంగళవారం ఉదయం వ్యక్తిగత పనిమీద ద్విచక్రవాహనంపై ఓర్వకల్లుకు బయలుదేరారు. పని ముగించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. గడివేముల క్రాస్ రోడ్డు వద్ద స్పీడ్ బ్రేకర్లను దాటించే క్రమంలో బైక్ అదుపు తప్పడంతో కిందపడ్డారు. ఈ ఘటనలో వెంకటప్రసాద్ తలకు బలమైన రక్తగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా, సుమంత్ కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సహాయంతో క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు: రైల్వేస్టేషన్ శివారులోని తుంగభద్ర బ్రిడ్జిపై ఉన్న రైల్వే బ్రిడ్జి ఇనుప కమ్మికి గుర్తు తెలియని వ్యక్తి నైలాన్ తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం స్థానికులు కనుగొని సమాచారం ఇవ్వడంతో రైల్వే పీఎస్ ఎస్ఐ బి.శ్రీనివాసరావు అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతదేహం వద్ద చెక్ చేయగా బనగానపల్లె నుంచి కర్నూలుకు వచ్చిన బస్ టిక్కెట్ లభ్యమయ్యింది. పూర్తి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. ఆచూకీ తెలిసినవారు సెల్: 85559 85303కు సమాచారం తెలియజేయాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

పోలీస్/SSC-GD/RPF/ఉద్యోగాలు

■ 84,866 CRPF, CISF, BSF కానిస్టేబుల్ ఉద్యోగాలు కలవు. అ:10th పాస్, వ:18-28 , మహిళలకు 50% ఫీజు తగ్గింపు. వ్రాత పరీక్ష తెలుగులో ఉంటుంది. జాబ్ గ్యారెంటీ శిక్షణ. స్టార్ డిఫెన్స్ అకాడమి, నంద్యాల, సెల్ :87908 44959. [L-798875]

DISTANCE EDUCATION

■ శ్రీ వెంకటేశ్వర అకాడమి ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా ఒకే సం॥లో 10th, ఇంటర్ (All Groups) కలవు. 100% పాస్ ANU, AU, SV యూనివర్శిటీల ద్వారా డిగ్రీ, పి.జి కోర్సులు కలవు. సి.క్యాంప్, కర్నూలు. 93915 01095 [L-798866]

REAL ESTATE

PLOT FOR SALE

■ నెలసరి కంతులలో కర్నూలు-నంద్యాల రోడ్, తిప్పాయిపల్లె దగ్గర ఓపెన్ ప్లాటు కలవు. & ఓర్వకల్లు MRO ఆఫీస్ దగ్గర ఓపెన్ ప్లాట్లు కలవు. సం.ప్ర: 99638 00314 [L-781081]

■ ఓర్వకల్లు ఎయిర్ పోర్టు వెనుక శకునాల ఇండస్ట్రియల్ హబ్ దగ్గరలో సోలార్ పార్క్ ప్రక్కన, 30x40 (2.75 సెంట్లు) సెంటు 1.20 లక్షలు. ప్లాటు కేవలం 3.00 లక్షలు మాత్రమే. నితిక డెవలపర్స్, 98884 24222 ఏజెంట్లు కావలెను. [L-798877]

SERVICES

BUSINESS OFFER

■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact: for more info: 9010762111 [H-193264]

WANTED

■ ప్రముఖ టీవి.ఛానల్లలో పనిచేయుటకు యాంకర్స్, సబ్ ఎడిటర్స్, వీడియో ఎడిటర్స్, రిపోర్టర్స్, వీడియో కెమెరామెన్ కావలెను. అనుభవం ఉన్నవారికి మాత్రమే అవకాశం. 94909 59794 [L-781086]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సం.ప్ర. 9573633520, 9059633520. [M-1221861]

■ రామకృష్ణ గ్రూపు, (AP No.1) VJA, HYD శ్రీమంతులఇళ్లలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 వంపగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 91608 91122, 92814 52838 [B-1206459]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ:15000-40000/-ఫ్రీ రూమ్+భోజనం. Hyd, Ph: 8919613984 [HA-775]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9848571888/9640400073 [HA-794]

■ అద్భుత అవకాశం Hydలో గల ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫిక్స్డ్ సాలరీ +కమీషన్ +ఇన్సెంటివ్స్ + రూమ్ + భోజనం ఉచితం 10th, ఇంటర్, డిగ్రీ పాస్ ఫెయిల్ సంప్రదించండి. Ph: 7013191934, 7989371766 [H-193326]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.